రాజీవ్ హత్య గురించి రాస్తూండగానే ఇంకో వార్త వచ్చింది. ఆ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష పడింది. నళిని, ఆమె భర్త మురుగన్, బాంబు తయారు చేసిన అరివు, వారితో బాటు సుధేంద్రరాజా (అలియాస్ శాంతన్, శివరాజన్ అనుచరుడు, పద్మనాభన్ హత్య కేసులో నిందితుడు, మే 1 టీములో వచ్చాడు,) అయితే నళిని గర్భవతి కదాని యావజ్జీవశిక్షగా మార్చారు. తక్కినవాళ్లు క్షమాభిక్ష కోరారు. ఇన్నాళ్లకు మన ప్రభుత్వం దాన్ని తిరస్కరించిందని గతవారం వార్తల్లో వచ్చింది. అందుచేత వాళ్లకు ఉరిశిక్ష ఖాయం అన్నమాట. ఇక అప్పటి కథలోకి వెళదాం.

మురుగన్ ఏర్పాటు చేసిన వైర్‌లెస్ సెట్టుతో శివరాజన్ ఎల్‌టిటిఇ ఇంటెలిజెన్సు హెడ్ పొట్టు అమ్మన్‌తో మంతనాలు జరిపేవాడు. ఎవరికీ చిక్కని దొంగ వైర్‌లెస్ స్టేషన్ (వీటిని రోగ్ స్టేషన్స్ అంటారు పోలీసులు, దీనికి 95 వ నెంబరు ఎలాట్ చేశారు) ఏర్పాటు చేసుకుని జాఫ్నాలో వున్న 91 వ నెంబరు రోగ్ స్టేషన్‌కు వైర్‌లెస్ సందేశాలు పంపేవాడు. 1991లో డిఎంకె ప్రభుత్వాన్ని రద్దు చేసిన తర్వాత మద్రాసులోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్సు విభాగాలు యీ రెండు స్టేషన్ల మధ్య నడుస్తున్న సంకేతాలను గమనిస్తూనే వున్నాయి. కానీ ఆ సంకేతాల్ని ఛేదించలేకపోతున్నాయి. వైర్‌లెస్ ఆపరేటర్లు వీటిని ఛేదించాలని శ్రమిస్తూనే వున్నారు. రాజీవ్ హత్య తర్వాత గట్టిగా ఓ పట్టుపట్టడంతో యీ సంకేతాల అర్థం కొంత అస్పష్టంగా తెలిసింది. తర్వాత తర్వాత విచ్చుకుంది. కోడ్ అర్థం కావడంతో పాతవన్నీ బయటకు లాగి డీకోడ్ చేశారు. అప్పుడు తెలియవచ్చింది. 1991 మార్చి 22 న శివరాజన్ పొట్టు అమ్మన్‌కి పంపిన సందేశానికి అర్థం ఏమిటో ! రాజీవ్ హత్యకు సంబంధించినంత వరకు యిదే తొలి సందేశం.

శివరాజన్ మార్చిలో మద్రాసులోనే వున్నాడు కదా మార్చి 22 న పొట్టు అమ్మన్‌కు 95 స్టేషన్ నుండి సందేశాన్ని పంపాడు – "రాజీవ్ మార్చి 30 న మద్రాసు వస్తున్నాడు" అని. కామరాజ్ మెమోరియల్ హాలుని ప్రారంభించడానికి రాజీవ్ మార్చి 30 న మద్రాసు వస్తున్నాడని "దినమణి" అనే తమిళ దినపత్రిక 22 న వార్త వేసింది. అది చదవగానే శివరాజన్ యీ సందేశం పంపాడు. దీనితో బాటు యింకా రాసినది ఏమిటంటే – 'మనం అనుకున్న పని (రాజీవ్ హత్య అని మనం అర్థం చేసుకోవాలి) ఢిల్లీలో జరగాలంటే అది చాలా సమయం పడుతుంది. అందుకు చాలా ఎక్సర్‌సైజ్ చేయాలి. నెహ్రూని (జాఫ్నాలో శివరాజన్ స్వంత వైర్‌లెస్ ఆపరేటర్, చివరకు అతనితో బాటే చనిపోయాడు) పంపితే నేను స్వంత వైర్‌లెస్ స్టేషన్‌ని నడుపుకుంటాను. ఇంకో మాట – ట్రాఫిక్ బాగా వున్న ప్రాంతాల్లో కూడా వేగంగా కారు నడిపేలా డ్రైవర్‌కు శిక్షణ యిచ్చేందుకు ఎవరినైనా ఏర్పాటు చేయగలరా?'

దీన్ని బట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే – రాజీవ్‌ను చంపడానికి ఎల్‌టిటిఇ ఏ అవకాశాన్నీ వదులుకోదలచలేదు. అతను ఎన్నికలలో నెగ్గాక సెక్యూరిటీ పెరుగుతుంది కాబట్టి చంపడం కష్టం. ఢిల్లీలో ఎక్కువకాలం వుంటాడు కాబట్టి అక్కడ చంపడం యీజీ అనుకున్నారు. కానీ అక్కడ ఎల్‌టిటిఇ సానుభూతిపరుల సంఖ్య తక్కువ కాబట్టి చంపడం కష్టం అని శివరాజన్ అంచనా. మద్రాసులో అయితే పుష్కలంగా వున్నారు కాబట్టి అక్కడ చంపుదామనుకున్నాడు. చివరకు అటు తిరిగి, యిటు తిరిగి పెరంబుదూరులో చంపారు. శివరాజన్ సందేశం చూశాక పొట్టు అమ్మన్ ఢిల్లీలో కూడా ఓ క్యాంప్ పెట్టాలని అనుకున్నాడు. తమిళనాడులో రాజీవ్ ఏ కారణంగానైనా తప్పించుకుంటే ఢిల్లీలో చంపాలని ప్లాను చేస్తే అక్కడ క్యాంప్ ఎంతో అవసరం. శివరాజన్ చనిపోయాక ఎల్‌టిటిఇ పగతో మరో ప్రముఖుణ్ని ఎవరినైనా చంపి తమ తడాఖా చూపిద్దామనుకుంది. అంతేకాదు, జయలలితను కూడా చంపాలని అనుకుందని అంటారు. జయలలితకు మద్రాసులో వున్న సెక్యూరిటీ ఢిల్లీలో వుండదు కాబట్టి అక్కడ చంపడం యీజీ. ఈ కారణాల వలన ఢిల్లీ క్యాంపు తయారు చేయాలి.



ఢిల్లీ క్యాంపు నడపడానికి పొట్టు అమ్మన్ ఎంచుకున్న వ్యక్తి అతిరై. ఆమెకు సహాయంగా పంపబడిన వ్యక్తి కనకసభాపతి. 1991 మే 1 న శివరాజన్ తన హంతకబృందంతో వేదారణ్యంలో అడుగు పెట్టేనాటికే వీళ్లు మద్రాసులో కుదురుకున్నారు. అతిరై గురించి చెప్పుకోవాలంటే – ఆమె అసలు పేరు చంద్రలేఖ. ఎల్‌టిటిఇలో ఆడపులి దళంలో సభ్యురాలు. డ్రైవింగ్‌లో నిష్ణాతురాలు. క్రిప్టాలజిస్టు. (రహస్య సంకేతాలను కోడ్‌లో పంపుతారు, యితరుల కోడ్‌ను ఛేదిస్తారు). దళంలో అందరూ ఆమెను సోనియా అని పిలుస్తారు. ఇండియాకు వచ్చేముందు ఆమె మరో రెండు పేర్లు తగిలించుకుంది. అతిరై, గౌరి. ఆమెతో బాటు పంపబడిన కనకసభాపతి గురించి చెప్పాలంటే – అతని పూర్తి పేరు కనససభాపతి ముత్తయ్య శివ గురునాథన్. అప్పటికే పెద్ద వయసువాడు. అతని కొడుకు హరిశ్చంద్రన్ ఎల్‌టిటిఇ జాఫ్నా కమాండర్‌గా శ్రీలంక సైన్యంతో పోరాడుతూ 1987లో చనిపోయాడు. అతన్ని కల్నల్ రాధా అనేవారు. అతని తండ్రి కాబట్టి యితన్ని రాధా అయ్యా అనేవారు. కొడుకు మరణం తర్వాత యితను ఎల్‌టిటిఇతో చేతులు కలిపాడు.



1991 ఏప్రిల్ చివరివారంలో పొట్టు అమ్మన్ సభాపతిని, అతిరైను రహస్యంగా బోట్‌లో ఇండియాకు పంపాడు. వాళ్లకి అప్పగించిన బాధ్యత – శివరాజన్ చెప్పినట్లు విని ఢిల్లీలో ఎల్‌టిటిఇ శిబిరాన్ని ఏర్పాటు చేయడం, ఢిల్లీలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోను ఎల్‌టిటిఇ కార్యకలాపాలు సజావుగా జరిగేలా పర్యవేక్షించడం, ఢిల్లీకి వచ్చి వెళ్లే ఎల్‌టిటిఇ కార్యకర్తలకు ఆశ్రయం కల్పించడం, అవసరమైతే వాళ్లను నేపాల్ మీదుగా యితర దేశాలకు రవాణా చేయడం..! సభాపతికి మద్రాసులో సెలైయూర్‌లో బంధువులున్నారు. అక్కడికి యీ అతిరైను, చొక్కన్ అనే కుర్రాణ్ని తీసుకుని వచ్చాడు. ఈ చొక్కన్ శివరాజన్ అనుచరుడు. (రాజీవ్ హత్య తర్వాత అతిరై, కనకసభాపతి

పోలీసులకు పట్టుబడ్డారు. వాళ్ల ద్వారా చాలా వివరాలు తెలిసాయి)

వీళ్లు మద్రాసు వచ్చినది ఏప్రిల్ చివరివారంలో. మార్చి, ఏప్రిల్ నెలలలో శివరాజన్ మద్రాసులో చేసిన ఏర్పాట్లేమిటో చూద్దాం. అతను అరివు తయారుచేసిన బెల్టు బాంబు ఎలా వుందో పరీక్షించాడు. తను స్వయంగా పేలుడు పదార్థాలలో నిపుణుడు కాబట్టి అది పనికి వస్తుందని సంతృప్తి పడ్డాడు. మార్చి నెలాఖరు కల్లా ముత్తురాజన్‌కు, బేబీ సుబ్రహ్మణ్యానికి "మీరు యిక భారత్‌లో వుండడం క్షేమం కాదు, శ్రీలంకకు తిరిగి వెళ్లిపోండి" అని చెప్పి పంపించేశాడు. భాగ్యనాథన్ యింటికి మకాం మార్చాడు. అక్కడ మురుగన్, నళిని, భాగ్యనాథన్‌లతో కలిసి చంపబోయేది ఎవర్నో చెప్పకుండా తమ పథకాన్ని చర్చించాడు. నమ్మకస్తులైన ఫోటోగ్రాఫర్లుగా హరిబాబు, రవిశంకర్‌లను రంగంలోకి తీసుకుని వచ్చాడు. ఎల్‌టిటిఇ ఏదో పెద్ద ప్లానులో వుందని వాళ్లకు తెలిసినా వెనక్కు రాలేనంతగా కూరుకుపోయామని గ్రహించి నోరు మూసుకుని వీళ్లు చెప్పినదల్లా చేశారు.

అప్పుడు శివరాజన్ జాఫ్నాకు తిరిగి వెళ్లి ప్రభాకరన్‌ను కలిసి మద్రాసులో అప్పటిదాకా జరిగిన పనులన్నీ ఏకరువు పెట్టాడు. అప్పుడు ప్రభాకరన్ "అసలు హత్య జరిగేందుకు ముందు రిహార్సల్ దాడులు జరిపి చూడండి. మొత్తం హత్యా తతంగాన్ని ఫోటోలు తీసి నాకు పంపండి" అన్నాడు. అలా తీసిన ఫోటోలను ఆల్బమ్‌లో పెట్టుకుని రికార్డు చేయడం ప్రభాకరన్‌కు అలవాటు. రిహార్సల్ చేయడానికి శివరాజన్ ఏం చేశాడో వచ్చే సోమవారం చూద్దాం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**